
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

సోమవారం 10 నవంబరు 2025








# అనంతగిరికి పోటెత్తిన భక్తజనం

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని అనంతగిరి పద్మనాభ స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. జాతర సందర్భంగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. జాతర ప్రాంగణం మొత్తం కిక్కిరిసిపోయింది. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు క్యూలో నిలబడి స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నెల 14న చక్రతీర్థంతో స్వామి ఉత్సవాలు ముగియనున్నట్లు ఆలయ ఏఓ నరేందర్ తెలిపారు.

- వికారాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి)



దర్శనం కోసం క్యూలో భక్తులు



శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



# కీసరగుట్ట.. భక్తులతో కిటకిట

కీసరగుట్ట రామలింగేశ్వరాలయంలో భక్తుల కోలాహలం నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. కార్తీక మాసోత్సవంలో భాగంగా కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం కీసరవాణీ, పార్కు, తదితర ప్రాంతాల్లో కుటుంబ సభ్యులతో కలిసి వన భోజనాలు ఆచరించారు. ఆట, పాటలతో సందడి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో కీసర ప్రధాన చౌరస్తా వద్ద ట్రాఫిక్ స్తంభించింది. స్థానిక సీఐ ఆంజనేయులు, ట్రాఫిక్ సీఐ నాగరాజు ట్రాఫిక్‌ను నియంత్రించారు.

- కీసర, నవంబరు 9(ఆంధ్రజ్యోతి)



హాజీపూర్‌లో అనాథలైన చిన్నారులకు ఆర్థికసాయం చేస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

## బాధిత కుటుంబాలకు వారంలో కేంద్ర పరిహారం

» చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు,యాలాల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మీర్జాగూడ బస్సు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం వారంలో ఒక్కొక్కరికీ రూ.2లక్షల చొప్పున పరిహారం అందజేస్తుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. బస్సు ప్రమాదంలో మృతిచెందిన హాజీపూర్‌కు చెందిన దంపతులు బందెప్ప, లక్ష్మి కూతుళ్లు భవాని, శివలీలను పరామర్శించి రూ.30 వేల ఆర్థికసాయం చేశారు. అలాగే లక్ష్మీనారాయణపూర్‌లో కూతురు అఖిలారెడ్డిని కోల్పోయిన తల్లిని, పేర్కంపల్లిలో ముగ్గురు కూతుళ్లను కోల్పోయిన తండ్రి ఎల్లయ్యగౌడ్‌ను, రాజీవ్ గృహకల్పలో యజమాని, కూతురు, మనవరాలిని కోల్పోయిన కుటుంబాన్ని పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.20 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన భవాని, శివలీల బాధ్యత తనదని, వారు ఎంతవరకు చదివితే అంతవరకు చదివిస్తానని తెలిపారు. ఆ తర్వాత తమ ఆస్పత్రిలోనే తన భార్య సంయుక్త ఉద్యోగ అవకాశం కల్పిస్తుందని హామీ ఇచ్చారు. లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన మృతురాలు అఖిలారెడ్డి సోదరుడు ఇంజనీరింగ్ చదువుతున్నాడని ఆయనకు ఉద్యోగం వచ్చే విధంగా చూస్తానన్నారు. బీజాపూర్ హైవే మలుపులు లేకుండా చూడాలని అధికారులను కోరినట్లు తెలిపారు. చేవెళ్ల పార్లమెంటు పరిధిలో ఒక ఎంపీగా 200 సీసీ రోడ్లను నిర్మించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ కార్యవర్గ సభ్యుడు రమేష్, యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా, మాజీ కౌన్సిలర్లు అంతారం లలిత, సాహు శ్రీలత, బీజేపీ నాయకులు రజని కాంత్, నాగారం మల్లేశం, తదితరులు ఉన్నారు.

## కల్వర్టులు మాయం

అక్రమార్కుల పాగా .. పట్టించుకోని అధికారులు

ఎక్కడికక్కడ నిలుస్తున్న వర్షపు నీరు

8

కార్పొరేషన్ల వారీగా వివరాలు

| కేటగిరీ | యూనిట్లు | దరఖాస్తులు |
|---|---|---|
| ఎస్సీ | 4,677 | 12,764 |
| ఎస్టీ | 2,730 | 6,616 |
| బీసీ | 4,735 | 23,180 |
| ఈబీసీ | 1,235 | 1,079 |
| మైనార్టీ | 1,804 | 14,152 |
| క్రిస్టియన్ | 94 | 53 |

# 'యువ వికాసం' ఎప్పుడో!

## లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ముగియకముందే నిలిపివేత

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు నోచుకోవడం లేదు. గత జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ పథకం అమలుకు శ్రీకారం చుట్టేందుకు సన్నాహాలు చేసినా చివరకు వాయిదా పడింది. దీనిపై ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఎదురుచూపులు తప్పడం లేదు.



అయోమయంలో దరఖాస్తుదారులు

యువతకు తప్పని ఎదురుచూపులు

ప్రభుత్వం నుంచి కొరవడిన స్పష్టత

జిల్లాకు కేటాయించిన యూనిట్లు 15,275

వచ్చిన మొత్తం దరఖాస్తులు 57,844



వికారాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాజీవ్ యువ వికాసం పథకం కింద ఎంపికైన వారికి రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఉపాధి కోసం ఇచ్చే రుణాల్లో రూ.50 వేలు తీసుకుంటే వంద శాతం రాయితీ కల్పించాలని, రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు 90 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించారు. రూ. లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం, రూ.4 లక్షల రుణం తీసుకుంటే 70 శాతం రాయితీగా అందించనున్నారు. రాజీవ్ యువ వికాసం పథకం కోసం జిల్లాలో భారీ సంఖ్యలో యువతీ యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. రూ.50 వేల నుంచి రూ.4 లక్షల ఆర్థికసాయం

మిగతా 8వ పేజీలో...

### నెలలు గడుస్తున్నా స్పష్టత కరువు

రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 2వ తేదీన రూ.50 వేలు, రూ.లక్ష లోపు రుణాలను మంజూరు చేసి ఇందుకు సంబంధించిన ఆర్థికసాయం ఉత్తర్వులు అందజేస్తామని అధికారులు తెలిపారు. ఆ తర్వాత దశల వారీగా రాజీవ్ యువ వికాసం లక్ష్యాలను పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. అయితే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి కాకముందే ఈ పథకం అమలును తాత్కాలికంగా నిలిపివేయాలంటూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కూడా మధ్యలోనే నిలిచిపోయింది. నెలలు గడుస్తున్నా ఈ పథకం అమలుపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావడం లేదు. రాజీవ్ యువ వికాసం పథకం అమలుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని దరఖాస్తుదారులు డిమాండ్ చేస్తున్నారు.



విజేతలుగా నిలిచిన విద్యార్థులు

## కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మేడ్చల్ టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన కరాటే పోటీల్లో మేడ్చల్ పట్టణానికి చెందిన యూనివర్సల్ 369 మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు పతకాలను కైవసం చేసుకున్నారు. అండర్ 14 విభాగంలో నిర్వహించిన పోటీల్లో పి.చైతన్య, జి.వరుణ్ తేజ్ బంగారు పతకాలు సాధించగా, అండర్ 17 విభాగంలో వీర భద్రసింగ్ బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. పతకాలు సాధించిన ముగ్గురు విద్యార్థులను త్వరలో వికారాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు 369 మార్షల్ ఆర్ట్స్ నిర్వాహకులు అభినందించారు.

## కొండెక్కిన కోడిగుడ్డు



ఘట్‌కేసర్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలోనూ చికెన్, కోడిగుడ్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సాధారణంగా ఈ మాసంలో చాలామంది మాంసాహారానికి దూరంగా ఉంటారు. కార్తీక పూజలతోపాటు అయ్యప్ప మాలలు ధరిస్తారు. దీంతో చికెన్, గుడ్ల ధరలు తగ్గుతాయి. కానీ ఈ ఏడాది కార్తీక మాసంలో వాటి ధరలు ఆకాశానికి ఎగబాకడం విశేషం. ఆదివారం కిలో చికెన్ రూ.220 ఉండగా.. హోల్‌సెల్‌లో 30 గుడ్లకు రూ.180 ధర పలుకుతున్నది. రిటైల్ మార్కెట్‌లో రూ.7కు ఒక గుడ్డు చొప్పున విక్రయిస్తున్నారు.

# పిక్కలు పీకేస్తున్నాయ్..

భయభ్రాంతులకు గురి చేస్తున్న వీధి కుక్కలు.. రోజురోజుకూ పెరుగుతున్న కుక్కకాటు కేసులు

సంతాన నియంత్రణ చికిత్స చేసినా తగ్గని సంతతి.. భయాందోళనలో తాండూరు బల్దియా ప్రజలు

తాండూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలు జనాల గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. తాండూరులో ఎక్కడ పడితే అక్కడ గుంపులు గుంపులుగా సంచరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. బయటకు వెళ్తే పిక్కలు పట్టేస్తాయని ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ప్రతి నెలా 200కు పైగా కుక్కకాటు బాధితులు తాండూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో టీకాలు వేయించుకున్నారు. ఇటీవల మనుషులే కాకుండా జీవాలపై కుక్కల దాడులు పెరిగిపోతున్నాయి. తాండూరు పట్టణంలోని విజ్ఞాన్‌పురి కాలనీలో ఒక్కసారిగా

మిగతా 8వ పేజీలో...



తాండూరులో కుక్క కాటు ఘటనలు ఇలా..

| నెల | కుక్కకాటు |
|---|---|
| జనవరి | 262 |
| ఫిబ్రవరి | 277 |
| మార్చి | 215 |
| ఏప్రిల్ | 208 |
| మే | 328 |
| జూన్ | 220 |
| జూలై | 275 |
| ఆగస్టు | 257 |
| సెప్టెంబరు | 227 |
| అక్టోబరు | 241 |



తాండూరులో పట్టుకున్న కుక్కలు(ఫైల్)

### కుక్కల దాడిలో 55 మేకల మృత్యువాత

పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామంలో ఇటీవల కుర్వ సాతప్పకు చెందిన 55 మేక పిల్లలను కుక్కలు దాడి చేసి కొరికి చంపేశాయి. మేక పిల్లల చుట్టూ కంచె వేసి పెద్ద మేకలను మేపడానికి తీసుకెళ్లగా శివార్లలో సంచరిస్తున్న కుక్కల గుంపు మేక పిల్లలపై దాడులు చేసి వాటిని కొరికి చంపేయడంతో సుమారు రూ.3 లక్షల మేరకు నష్టం వాటిల్లింది. మేకల సాకుతూ జీవనం సాగిస్తున్న సాతప్పకు శాసనసభ విప్ బీర్ల ఐలయ్య, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కొంత ఆర్థికసాయం చేశారు. శివార్లలో కొన్ని హాస్టళ్లలో విద్యార్థులకు ప్రతి వారం మాంసం ఆహారంగా పెడుతుండడంతో వాటి వేస్టేజ్ బయట పారవేయగా వాటిని తిన్న అలవాటుకు మేకలు, గొర్లపై దాడి చేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

## 26 కిలోల గంజాయి పట్టివేత

» వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు

వికారాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ పోలీసుల తనిఖీల్లో 26 కేజీల గంజాయిని పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం నుంచి వచ్చే రైళ్లలో గంజాయి రవాణా జరుగుతుందన్న విశ్వసనీయ సమాచారంతో ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం ఆదివారం గంజాయి అక్రమ రవాణాపై నిఘా పెట్టారు. రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే ఆసుపత్రి పరిసరాల్లో అనుమానాస్పదంగా మూడు బ్యాగులు కన్పించాయి. వాటి చుట్టుపక్కల ఎవరూ లేక పోవడంతో అధికారులు వాటిని పరిశీలించగా ఆ బ్యాగుల్లో బ్రౌన్ టేప్‌తో చుట్టి ఉన్న 13 ప్యాకెట్లు దొరికాయి. వాటిలో మొత్తం 26 కిలోల ఎండు గంజాయిని గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ ప్రేమ్ కుమార్ రెడ్డి, సిబ్బంది విష్ణువర్ధన్ రెడ్డి, రవికిరణ్, శివ ప్రసాద్, కుమార్ పాల్గొన్నారు.



ధారూరు మెథడిస్టు జాతరకు తరలివచ్చిన క్రైస్తవులు(ఫైల్)

# రేపటి నుంచి మెథడిస్టు జాతర

» ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

» లక్షలాదిగా తరలిరానున్న క్రైస్తవులు

ధారూరు, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): ధారూరు క్రిష్టియన్ మెథడిస్టు జాతర ఈ నెల 11న మంగళవారం ప్రారంభమై 16న ఆదివారంతో ముగుస్తుంది. మండల పరిధిలోని స్టేషన్ ధారూరు, దోర్నాల గ్రామాల మధ్య కాగ్నా ఉప నది పక్కన గల మెథడిస్టు జాతరకు కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఉత్సవాలకు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి లక్షలాదిగా క్రైస్తవ భక్తులు తరలిస్తారు. భక్తులు రోడ్డు మార్గాన కాలినడకన జాతరకు చేరుకుని మొక్కు తీర్చుకుంటారు. జాతరకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక రైళ్లు, బస్సులు ఉంటాయి. ప్రధాన వేదిక వద్ద ఇప్ప చెట్టు, ముఖద్వారం వద్ద ఉన్న ఏసు ప్రభువు శిలువల వద్ద భక్తులు కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేస్తారు. ఈ ఉత్సవాలకు మత గురువులు హాజరై దైవ సందేశాలు వినిపిస్తారు. ఆరు రోజులపాటు ఏసుక్రీస్తు భజనలు, కీర్తనలతో జాతర ప్రాంగణం హోరెత్తనుంది.

### ఐదుగురితో ప్రారంభమైన జాతర..

కోరిన కోర్కెలు నెరవేరినందుకు ఇద్దరు మిత్రులు మొత్తం ఐదుగురితో కలిసి ప్రారంభించిన ధారూరు జాతర నేడు లక్షలాది క్రైస్తవుల ప్రార్థనలతో మార్మోగుతుంది. రెవరెన్ సీమండ్స్, జేటీ సీమండ్స్ ఇద్దరు మిత్రులు. వీరు 1921లో గుల్బర్గా నుంచి హైదరాబాద్‌కు రైలులో ప్రయాణిస్తున్నారు. రైలు సాంకేతిక సమస్యతో ధారూరు రైల్వే స్టేషన్‌లో ఆగిపోయింది. అక్కడ రైలు దిగి పక్కనే ఉన్న కాగ్నా ఉపనది ఒడ్డున ఇప్ప చెట్టు కింద కూర్చుని ఏసు క్రీస్తును స్మరిస్తూ ప్రార్థనలు చేశారు. తమ కోరిక నెరవేరితే ఏటా ఇక్కడ జాతర జరుపుతామని మొక్కుకొని తిరిగి రైలులో వెళ్లిపోయారు. హైదరాబాద్ చేరుకున్న తర్వాత వీరి కోరిక నెరవేరింది. దీంతో వారు ప్రార్థన చేసిన ఇప్ప చెట్టు కింద ఏసు క్రీస్తు శిలువను నిర్మించి జాతరను ప్రారంభించారు. నాడు వీరితోపాటు మరో ముగ్గురు కలిసి ప్రారంభించిన జాతరకు ఏటా పెద్దఎత్తున క్రైస్తవ భక్తులు తరలివస్తున్నారు.

పీహెచ్‌సీలో రేపు కంటి వైద్య శిబిరం

తొల్కాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని వైద్యాధికారి అమూల్య ప్రియదర్శిని ఆదివారం తెలిపారు. ఈ శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆమె కోరారు.



మాట్లాడుతున్న ఎం.వెంకటేశ్వర్

## న్యాయ సేవలపై అవగాహన కల్పించాలి

**» జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్**

వికారాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): న్యాయస్థానాలు పేదలకు ఉచితంగా అందించే న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్ తెలిపారు. న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. న్యాయసేవలు పేదలకు కూడా అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో న్యాయసేవా సంస్థ ఉచిత న్యాయ సేవలను అందజేస్తోందన్నారు. ఉచిత న్యాయసేవలపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన బాల్య వివాహ, గృహ హింస నిరోధక చట్టాలు, పోక్సో వృద్ధుల సంరక్షణ చట్టాలు, చట్టాలను అతిక్రమిస్తే వేసే శిక్షలు, సామాజిక ప్రాముఖ్యతలపై అవగాహన కల్పించారు. చిన్నారులకు భద్రత, మహిళా రక్షణ, పౌరుల న్యాయ అవగాహన అవసరాల గురించి వివరించారు. డొమెస్టిక్ వయొలెన్స్ చట్టం(డీవీసీ) కింద మహిళల హక్కులు, ఫిర్యాదు విధానం, న్యాయ సహాయంపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహబూబ్ ఫాతీమా, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ టి.వెంకటేష్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పి.రాము, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఎం.శ్రీనివాస్, లెక్చరర్లు షమీమ్ సుల్తానా, లలిత, వార్డెన్ షబానా బేగం తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

**» విరిగిన స్టీరింగ్ రాడ్డు**



స్టీరింగ్ రాడ్డు విరిగి నిలిచిన బస్సు

తాండూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తాండూరు నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్న తాండూరు ఆర్టీసీ డిపో అద్దె బస్సు(టీఎస్ 34 టీఏ5454) ఆదివారం తాండూరు నుంచి మహబూబ్‌నగర్‌కు 40మంది ప్రయాణికులతో వెళ్తోంది. యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ వద్ద బస్ స్టీరింగ్ విరిగిపోవడంతో డ్రైవర్ వెంటనే బస్సును నిలిపేశాడు. ఆ సమయంలో బస్సు వేగం తక్కువగా ఉండటంతో ప్రయాణికులకు పెను ముప్పు తప్పింది. వెంటనే బస్సుకు మరమ్మతులు చేయించారు. తాండూరు నుంచి మహబూబ్‌నగర్‌కు రోజూ 20 సర్వీసులు అటూ ఇటూ నడుస్తుంటాయి. కాగా స్టీరింగ్ నట్‌బోల్టు ఊడిపోవడం వల్లే బస్సు నిలిచిందని తాండూరు డిపో మేనేజర్ సురేష్ తెలిపారు. డిపో బస్సులన్నీ మంచి ఫిట్‌నెస్‌తో ఉన్నాయని చెప్పారు.

## వచ్చే ఎన్నికల్లో అధికారంలోకొచ్చేది బీఆర్‌ఎస్సే



సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు

శంషాబాద్ రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ పార్టీనే అని ఎమ్మెల్యే సబితారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం నర్కూడ, చౌదరిగూడ, కాచారం గ్రామాల కాంగ్రెస్, బీజేపీల వంద మంది కార్యకర్తలు సబితారెడ్డి, కార్తీక్‌రెడ్డిల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అవుతున్నా హామీలు నేరవేర్చడంతో విఫలమైందన్నారు. మహిళలకు ఉచిత బస్సు తప్ప మరే పథకం అమలు కాలేదన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భర్త, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దిద్యాల శ్రీనివాస్, పెద్దషాపూర్ మాజీ సర్పంచ్ బీసీసెల్ మండలాధ్యక్షుడు దేవులపల్లి సత్యనారాయణగౌడ్, బుర్కుంట సతీష్, గౌస్‌పాషా, బాబు, గోపాల్, మహేష్, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

## ధైర్యంగా ఉండు.. అండగా ఉంటాం

**» ముగ్గురు కూతుళ్లను కోల్పోయిన తండ్రికి స్నేహితుల ఓదార్పు**



ఎల్లయ్యగౌడ్‌ను పరామర్శిస్తున్న క్లాస్‌మేట్స్

తాండూరు, యాలాల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి):చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కూతుళ్లను కోల్పోయిన ఎల్లయ్యగౌడ్‌కు ఆదివారం ఆయన క్లాస్‌మేట్స్, ఆయన స్నేహితులు పేర్కంపల్లికి వెళ్లి పరామర్శించారు. ధైర్యం చెప్పారు. బస్సు ప్రమాదంలో మృతిచెందిన తనూష, సాయిప్రియ, నందిని ఫొటోలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. 1989-90 బ్యాచ్ టెన్త్ క్లాస్‌మేట్స్ అండగా ఉంటామని ఎల్లయ్యగౌడ్‌కు భరోసా ఇచ్చారు. ఓదార్చిన వారిలో తాండూరు వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ విఠల్‌నాయక్ ఉన్నారు.

## నేడు, రేపు బాలానగర్‌లో సెలవు

కీసర, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో మేడ్చల్ జిల్లాలోని బాలానగర్ మండలంలో పోలింగ్ నిర్వహిస్తున్న బూత్ కేంద్రాల కార్యాలయాలకు, సంస్థలకు సోమ, మంగళవారాల్లో సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ మను చౌదరి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 10, 11 తేదీల్లో వేతనంతో కూడిన సెలవు ప్రకటిస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

## మూడు కాళ్ల కోడిపిల్ల



కందుకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోళ్లకు రెండు కాళ్లు ఉండడం సాధారణం. అయితే తిమ్మాపురంలో పొల్కం మల్లేష్ పౌల్ట్రీఫామ్‌లో ఆదివారం మూడు కాళ్లతో ఓ కోడిపిల్ల జన్మించింది. ఈ కోడిపిల్లను చూసి స్థానికులు విస్మయం చెందారు. అయితే జన్య లోపాలతో కొన్నిసార్లు ఇలా జరుగుతుందని పశువైద్యులు తెలిపారు.

## యథేచ్ఛగా చెట్ల నరికివేత

ఘట్‌కేసర్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): హరితహారం కార్యక్రమంలో భాగంగా గతంలో నాటిన మొక్కలు నేడు చెట్లుగా మారాయి. వాటిని సంరక్షించాల్సిందిపోయి తొలగిస్తున్న దృశ్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని బొక్కోనిగూడ దత్తాత్రేయ కాలనీలో రోడ్డుకిరువైపులా చెట్లను పూర్తిగా తొలగించారు. తమ ప్లాట్లలోని చెట్లతో పాటు రోడ్డు పక్కల ఉన్న చెట్లను ఎలా తొలగిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఏళ్ల క్రితం నాటి చెట్లను రియాల్టర్లు యథేచ్ఛగా నరికేస్తున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. చెట్లను తొలగించాలంటే అటవీశాఖ అనుమతి తప్పనిసరి.. కానీ, ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా చెట్లను నరికివేస్తుండడంతో పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



బొక్కోనిగూడ దత్తాత్రేయ కాలనీలో నరికివేసిన చెట్లు



బాసరలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తాండూరు కవులు కోటం చంద్రశేఖర్, వడిచర్ల సత్యం తదితరులు

## బాసర కవి యాత్రలో తాండూరు కవులు

తాండూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 8, 9వ తేదీల్లో నిర్మల్ జిల్లా బాసరలో జరిగిన సాహిత్య కార్యక్రమంలో తాండూరు కవులు కోటం చంద్రశేఖర్, వడిచర్ల సత్యం పాల్గొన్నారు. అక్కడ జరిగిన నాటక ప్రదర్శన, కవి సమ్మేళనం, అష్టావధానం, పుస్తకావిష్కరణ తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తాండూరు కవి వడిచర్ల సత్యం అధ్యక్షుడిగా ఏర్పాటైన కార్యక్రమంలో ఎన్నారం శ్రీనివాస్ రచించిన మానస పద్య శతకం నవీన్ గోరింక రచించిన రైతన్న మణిపూసల శతకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి రచయిత పోరెడ్డి రంగన్న, అష్టవధానులు ఓంప్రకాశ్, కమలేశ్, సాహితీవేత్త, ప్రజ్ఞాశాలి దొరవెట్టి చెన్నయ్య పాల్గొన్నారు.

# చెట్టు.. ప్రాణం పోదు ఒట్టు

## వృక్షాల పరిరక్షణకు రీలొకేట్ విధానం

**» తిరిగి నాటడం ద్వారా మోడులకు జీవం**
**» ఎన్‌హెచ్ 44 హైవే విస్తరణలో అధికారుల నిర్ణయం**
**» పర్యావరణ ప్రియుల హర్షం**

షాద్‌నగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రహదారుల విస్తరణకు రోడ్డు పక్కన పెంచిన వందలాది వృక్షాలు నరికేయడం గతంలో చూశాం. దశాబ్దాల వయసున్న భారీ వృక్షాలు నేలమట్టం అయితే ఎంతో మంది ఆవేదన చెందుతారు. కానీ ప్రస్తుతం పరిస్థితి మారింది. రహదారుల నిర్మాణానికి తొలగించే చెట్లను వేరే చోట రీలొకేట్ చేస్తూ వాటిని సంరక్షిస్తున్నారు. కూకటి వేళ్లతో పెకిలించి తీసుకెళ్లి మైదాన ప్రాంతాలు, అడవుల్లో నాటుతున్నారు. జాతీయ రహదారి పక్కనున్న చెట్ల విషయంలో అధికారులు ఈ విధానాన్ని పాటిస్తుండటం పర్యావరణ ప్రియులకు ఆనందాన్ని కల్గిస్తోంది. మరి ఏమిటీ విధానం.. దీంతో కలిగే ప్రయోజనాలేమిటి అన్న అంశాలను పరిశీలిస్తే...



మట్టి ఊడకుండా గోనె సంచితో కట్టిన చెట్లవేర్లు



రీ లొకేట్ చేసిన వృక్షాల మోడులు

**గతంలో ఇలా..**

రహదారుల విస్తరణలో రోడ్డుకు ఇరుపక్కల వృక్షాలను తొలగింపు పనులు సామిల్ కాంట్రాక్టర్లకు అప్పగించేవారు. వారు చిన్న చెట్లు, పెద్ద వృక్షాలను భారీ మిషన్లతో కట్‌చేసి కలపను విక్రయించేవారు. ఇలాంటి చెట్ల నరికివేతలు షాద్‌నగర్ పాత జాతీయ రహదారి విస్తరణ, పరిగి రోడ్డు, బైపాస్ రోడ్డు విస్తరణలో ఎన్నోసార్లు జరిగాయి. ప్రయాణికులకు నీడనిచ్చే చెట్లను నరికివేస్తుండటంతో ఎంతో మంది బాధపడ్డారు. ప్రభుత్వం చెట్లను పెంచి మరో పక్క నరికివేస్తుండటం జనం కూడా ప్రజలకు అసంతృప్తి కల్గించింది. అయితే వాహనాల సంఖ్యకు అనుగుణంగా రహదారుల విస్తరణ అనివార్యం. కొత్త విధానంతో రోడ్డు విస్తరణలో తొలగిస్తున్న వృక్షాలను కొన్ని చర్యలతో వేరే చోట నాటి పరిరక్షిస్తున్నారు.



క్రేన్లతో చెట్లను నాటుతున్న ఆర్అండ్‌బీ సిబ్బంది

**వృక్షానికి రక్ష**

ఈ ట్రీ రీలొకేషన్(రీ ప్లాంటేషన్) విధానంతో వృక్షానికి పూర్తి రక్షణనిస్తుంది. భారీ వృక్షాలను క్రేన్లతో కూకటి వేళ్లతో పెకిలిస్తారు. వేళ్లకున్న మట్టి ఊడిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. చెట్టును బయటకు తీసి సస్యరక్షణ చర్యలతో వేర్లకున్న మట్టి పోకుండా గోనె సంచితో కడతారు. వేళ్లు ఎండిపోకముందే తీసిన కొన్ని గంటల్లోనే మొదళ్లతో వేరే చోటికి తరలించి అప్పటికే తీసిన భారీ గుంతలో వృక్షానికి అవసరమయ్యే పోషకాలు పోసి దానిలో నాటతారు. అనువైన ప్రదేశాల్లో నాటి ఎండిపోకుండా చర్యలు చేపడుతున్నారు. భారీ వృక్షాలను అటవీ ప్రాంతంలో క్రేన్లు, డోజర్లతో లోతైన గుంతలు తీసి నాటుతున్నారు. పచ్చదన పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు ఇవి. ప్రస్తుతం ఎన్‌హెచ్ 44 ఆరులేన్ల రహదారి విస్తరిస్తున్న నేపథ్యంలో రోడ్డు పక్కన వృక్షాలను తొలగించే క్రమంలో ఈ విధానాన్ని పాటిస్తున్నారు. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

### ఇది మంచి పరిణామం



పర్యావరణ పరిరక్షణకు ఇలాంటి చర్యలు తీసుకోవడం మంచి పరిణామం. పర్యావరణ సమతుల్యానికి భూమిపై పచ్చదనం 33 శాతం ఉండాలి. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో 24శాతమే ఉంది. దీనికి ప్రధాన కారణం పచ్చదనాన్ని పెంపొందించకపోవడమే. రోడ్ల విస్తరణకు భారీ వృక్షాలు, చెట్లను నరుకుతున్నాం. అయితే ప్రస్తుతం జాతీయ రహదారి విస్తరణలో చెట్లను నరకకుండా కూకటి వేళ్లతో పెకిలించి మరో చోట నాటుతుండటం హర్షణీయం. వృక్షాల మొదళ్లను పారిశ్రామికవాడల్లో నాటితే ఉపయోగకరం. దేశవ్యాప్తంగా ఇలాంటి విధానాన్నే పాటిస్తే పచ్చదనం పెరిగి కరువును నివారించొచ్చు.

**- రవీందర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, షాద్‌నగర్**

### పర్యావరణానికి ఉపయోగం



పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్ల విస్తరణ తప్పదు. అయితే పర్యావరణ పరిరక్షణా అవసరమే. రహదారుల విస్తరణతో పాటు రోడ్డు పక్కనుండే వృక్షాలను వేళ్లతో పెకిలించి రిలొకేట్ చేయడం మంచి పరిణామం. అయితే ఏ ప్రాంతంలో వృక్షాలను తొలగించారో అదే ప్రాంతంతో నాటాల్సిన అవసరం ఉంది. లేదంటే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలకు కృతజ్ఞతలు.

**- గంగిరెడ్డి, సామాజికవేత్త, షాద్‌నగర్**



కమ్మ సేవాసమితి మహిళా కళాకారులతో చిట్టూరి సురేష్‌రాయుడు, అరికెపూడి గాంధీ

## ఐక్యతతో అభివృద్ధిని సాధించాలి

**కమ్మ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ**

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కమ్మ కులస్తులంతా ఐక్యతను చాటి, అభివృద్ధి సాధించాలని తెలంగాణ కమ్మ సేవా సమితి అధ్యక్షుడు, తెలంగాణ ప్యాక్ చైర్మన్ అరికెపూడి గాంధీ పిలుపునిచ్చారు. షాద్‌నగర్ కమ్మసేవా సమితి అధ్యక్షుడు పాతూరి వెంకటరావు ఆధ్వర్యంలో ఆదివారం ఎంపీ శేషయ్యనగర్ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన కమ్మవారి కార్తీక వనభోజనోత్సవానికి ఎమ్మెల్యే గాంధీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉసిరిచెట్టు వద్ద మహిళలు పూజలు చేసి, కూచిపూడి నృత్యాలు, ఆటలు పాటలతో అలరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రైవేట్ లెక్చరర్ శివకుమార్‌కు పాతూరి హైమవతి ఆధ్వర్యంలో మహిళలు 25వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. అది చూసిన అక్కడున్న పెద్దలు లక్షా 50వేలు ఇచ్చారు. గాంధీ మాట్లాడుతూ.. ప్రభుత్వ సహాయంతో శివకుమార్‌కు వైద్యం చేయించడానికి కృషిచేస్తానని తెలిపారు. కమ్మసేవా సమితి యేటా కార్తీక వనభోజనోత్సవాన్ని నిర్వహించడం, మహిళలు ఉత్సాహంగా వివిధ కార్యక్రమాలలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వ్యాపారాలు, రాజకీయాలు ఏమున్నా.. కమ్మలంతా ఐకమత్యంతో ముందుకుసాగాలని, అభివృద్ధికి పరస్పరం సహకరించుకోవాలని పిలుపునిచ్చారు. పౌల్ట్రీ రైతుల ఆస్తి పన్నును ప్రభుత్వం మాఫీ చేసిందని, ఎవరేం ప్రచారం చేసుకున్నా పట్టించుకోవద్దని, పంతాలకు పోవద్దని సూచించారు. అనంతరం మహిళా కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో వరల్డ్ ఎగ్ కమిషన్ చైర్మన్ చిట్టూరి సురేష్‌రాయుడు, కార్పొరేటర్ శ్రీకాంత్, కమ్మసేవా సమితి నాయకులు వసంతరావు, ప్రభాకర్‌రావు, బి.నాగేశ్వర్‌రావు, వి.రామసుబ్బారావు, పి.బ్రహ్మయ్య, పి.సత్యనారాయణ, వి. ఎర్రయ్య, జె.శ్రీనివాసరావు, కె.ప్రభాకర్, ఎం.మల్లేశ్వర్‌రావు, పి.రఘు, కె.హరి, కె.శ్రీను, ఎం.సాంబశివరావు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

## ధర్మాన్ని ఆచరిస్తే భగవదనుగ్రహం

**» కెంపిన మఠం పీఠాధిపతి డాక్టర్ చెన్నబసవ ప్రభు మహాస్వామి**
**» దామగుండం రామలింగేశ్వర స్వామి ఆలయంలో శతరుద్రాభిషేకం, సహస్ర దీపోత్సవం**



దామగుండం రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సహస్ర దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న కెంపినమఠం పీఠాధిపతి చెన్నబసవప్రభు మహాస్వామి

పూడూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మనం ధర్మాన్ని కాపాడితే ధర్మం మనల్ని కాపాడి భగవంతుడికి చేరువ చేస్తుందని ఆలంపల్లి కెంపిన మఠం, దుద్దిని పీఠాధిపతి డాక్టర్ చెన్నబసవప్రభు మహాస్వామి అన్నారు. తెలంగాణ వీరశైవ జంగమ అర్చక పురోహిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దామగుండం రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకం, కార్తీక సహస్ర దీపోత్సవం, వన భోజన కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథి చెన్నబసవప్రభు మాట్లాడుతూ.. ధర్మాన్ని ఆచరిస్తే జీవితానికి భుక్తి, ముక్తి లభిస్తుందన్నారు. క్రియా, జ్ఞాన యోగాల సమ్మిళితమే కార్తీక విశిష్టత అన్నారు. శివకేశవులు వేరువేరు కాదని, శివుడిని పూజిస్తే విష్ణువు కరుణిస్తాడన్నారు. దామగుండం పవిత్ర, విశిష్ట క్షేత్రమని, శివుడు, కోనేరు, మర్రి ఊడలు నేలను తాకేలా ఉన్న ఈ చోటు పరమ పవిత్రమైందన్నారు. ప్రతీ కార్తీకంలో రుద్రాభిషేకం, దీపోత్సవం, వన భోజన కార్యక్రమాలు నిర్వహిస్తున్న అనిల్‌కుమార్, కుటుంబ సభ్యులు అభినందనీయులని కొనియాడారు. వేద పండితుడు మఠపతి సాంబశివశర్మ మాట్లాడుతూ.. మానవులు ధర్మార్థకామమోక్షాలను అనుసరించాలన్నారు. ధర్మబద్ధంగా ఉండాలని, అప్పుడే భగవత్ సాక్షాత్కారం లభిస్తుందని చెప్పారు. శివకేశవులను స్మరించుకున్నా, దర్శించుకున్నా, స్పర్శించినా పుణ్యఫలమని, దీపారాధనతో శివకేశవుల అనుగ్రహం పొందుతామని చెప్పారు. కిషన్‌నగర్ వేదపాఠశాల ప్రధానాచార్యులు సంగయ్యస్వామి మాట్లాడుతూ.. కార్తీకమాసంలో శివకేశవారాధన, దీపారాధనకు, దానాలకు ప్రాముఖ్యం అన్నారు. మనుషులు ధనార్జన, కోరికలు నెరవేర్చుకోవడంపైనే దృష్టి సారించారని, ధర్మం, మోక్షం గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం చెన్నబసవ ప్రభు మహాస్వామి సహస్ర దీపోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ వీరశైవ జంగమ అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు వీరయ్యస్వామి, పురాణం నాగయ్యస్వామి, ఉపాధ్యక్షుడు మఠం రాజశేఖర్, నటరాజ్‌స్వామి, చంద్రశేఖర్‌స్వామి, ప్రదీప్ కుమార్, పార్వతయ్యస్వామి, బసవరాజ్ స్వామి, మహేశ్, శివకుమార్, నవీన్‌కుమార్, నరేష్, శివశంకర్‌స్వామి పాల్గొన్నారు.

## ప్రజల ఆకాంక్షలకనుగుణంగా కాంగ్రెస్ పాలన



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలే కాంగ్రెస్ ప్రభుత్వ ఎజెండా అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రతీ కుటుంబానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, కల్వకుర్తి, మాడ్గుల, తలకొండపల్లి, వెల్దండ మండలాల కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఈ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్‌కు చావు దెబ్బ తప్పదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉండడంతో అదే పార్టీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా చేసుకునేందుకు ప్రజలంతా నిర్ణయం తీసుకున్నారని అన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీల కుట్ర రాజకీయాలను ప్రజలు పరిగట్టారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 22నెలల్లో అద్భుత ప్రగతి సాధించిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు ఆయిల్ల శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, బట్టు కిషన్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మండ్లి రాములు, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, కేశవులు, సాయిరెడ్డి, గూడూరు భాస్కర్‌రెడ్డి, కాసు శ్రీనివాస్‌రెడ్డి, సూదిని కొండల్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, పర్వతరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీశైలం, బీచ్యనాయక్, దశరథం, మానయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప ఎన్నికలో నవీన్‌యాదవ్ గెలుపు తథ్యం

కందుకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపు ఖాయమని పీసీసీ ప్రధానకార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మహేశ్వరం ఇన్చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆదేశానుసారం ఆదివారం హైదరాబాద్ ఎల్లారెడ్డిగూడ డివిజన్‌లో పలు కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెండేళ్లలో సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి సంక్షేమపథకాలు బాగున్నాయని, తాము కాంగ్రెస్ అభ్యర్థికే ఓటు వేస్తామని ప్రజలంతా ముక్తకంఠంతో చెప్పారని తెలిపారు. ప్రచారంలో కార్యక్రమంలో నాయకులు యుగేందర్ గౌడ్, వెంకటేష్, పాండురంగారెడ్డి, రాకేష్‌గౌడ్, నరసింహ, ఎగ్గిడి కృష్ణ, శేఖర్, కుమార్, మహేందర్, పి.కుమార్, పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఏనుగు జంగారెడ్డి, కృష్ణానాయక్

## బీసీల హక్కుల సాధనకు త్వరలో భారీ బహిరంగ సభ



సమావేశంలో బీసీసంఘాల ఐక్యవేదిక నాయకులు

పరిగి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీల హక్కుల సాధనకు త్వరలో పరిగిలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కె.హన్మంత్ ముదిరాజ్, డాక్టర్ బి.జగన్మోహన్, కంకల్ వెంకటేశ్, సదానందం, కె.రవికుమార్‌గౌడ్, ఘనాపూర్ రాఘవేందర్‌గౌడ్, టి.రామస్వామి, న్యాయవాది ఆనంద్‌గౌడ్‌లు అన్నారు. బీసీలకు రిజర్వేషన్‌ల అంశంపై పరిగి శివారులోని డాక్టర్ బి.జగన్మోహన్ స్కూల్ ఆఫ్ ఎక్స లెన్స్‌లో బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 56శాతం జనాభా ఉన్న బీసీలకు రాజ్యాధికారం దక్కకుండా అగ్రకులాలు మోసం చేస్తూనే ఉన్నాయన్నారు. త్వరలో పరిగిలో లక్ష మందితో సభను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నాయకులు స్వరూపరాణి, పద్మాచారి, కె.రామకృష్ణ ధన్వేశర్, జింకల యాదయ్య, బుచ్చన్న, శ్రీశైలం, రామాంజనేయులు, మేకల యాదయ్య, ఎస్సీ సంఘాల నాయకులు వెంకటయ్య, ఎరన్‌పల్లి శ్రీనివాస్, నర్సింహులు పాల్గొన్నారు.

# కల్వర్టులు మాయం

- అక్రమార్కుల పాగా
- ఎక్కడికక్కడ నిలుస్తున్న వర్షపునీరు
- పట్టించుకోని అధికారులు



కీసరలో ఓ హోటల్ ఎదుట మూసివేసిన కల్వర్టు



చీర్యాల్‌లో ఓ బార్ ఎదుట మూసివేసిన కల్వర్టు

కీసర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరదనీరు నిలవకుండా ప్రధాన రహదారులపై నిర్మించిన కల్వర్టులను కొంతమంది అక్రమార్కులు మూసేశారు. దీంతో వర్షపునీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొంతమంది వ్యాపారులు కల్వర్టులను తమకు అనుగుణంగా మార్చుకొని వ్యాపారకలాపాలు సాగిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏళ్లుగా ఎగువ ప్రాంతంలోని వర్షపు నీరు ప్రధాన రహదారులపై నిలవకుండా, రోడ్లు చెడిపోకుండా కల్వర్టులు నిర్మించారు. కొన్నాళ్లు ఈ కల్వర్టుల గుండా వర్షపునీరు లోతట్టు ప్రాంతాలకు తరలివెళ్లేది. కాగా రాజకీయ పలుకుబడితో కొంతమంది కీసరలో కుషాయిగూడకు వెళ్లే ప్రధాన రహదారి, రాఘవేందర్ హోటల్‌కు ఎదురుగా, పోలీస్‌స్టేషన్ సమీపంలో రెండు చోట్ల కల్వర్టులను మూసివేశారు. దీంతో రహదారికి అనుకొని ఉన్న కాలనీవాసులు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

### యథేచ్ఛగా వ్యాపార కలాపాలు

కల్వర్టును పునఃరుద్ధరించాలని పలువురు కాలనీవాసులు గతంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలిపిన పాలకులు పట్టించుకోలేదు. దీంతో పాటు చీర్యాల్ పరిధిలోని త్రిశూల్ బార్ అండ్ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న కల్వర్టును కూడా మూసివేశారు. కల్వర్టుకు ఆనవాళ్లు లేకుండా చేసి తమ వ్యాపార కలాపాలను సాగిస్తున్నారు. అదే విధంగా రాంపల్లి దాయర గ్రామంలోని శ్మశాన వాటిన సమీపంలో, గోదుమకుంట గ్రామం రెవెన్యూ పరిధిలో ఓ వ్యాపారి కాలువను మొత్తం కబ్జా చేశాడు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మూసివేసిన కల్వర్టులను, కబ్జాకు గురైన కాలువలను పునరుద్ధరించాలని, లేదంటే భవిష్యత్తులో ప్రజల ఇబ్బందులు తీవ్రమవుతాయ్యే అవకాశాలు ఉన్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వర్షకాలం ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం లేకపోలేదని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో ఆక్రమణకు గురైన కల్వర్టులను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.



కీసర పోలీస్ స్టేషన్ సమీపంలో మూసేసిన కల్వర్టు

# 'యువ వికాసం' ఎప్పుడో!

(ఐదో పేజీ తరువాయి)

కోసం 57,844 మంది దరఖాస్తు చేసుకున్నారు. అర్హులను ఎంపిక చేయడంలో తొలిసారిగా రుణం తీసుకునే వారికి, సంబంధిత వ్యాపారంలో అనుభవం ఉన్న వారికి అర్హుల ఎంపికలో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. మొత్తం యూనిట్లలో దివ్యాంగులకు ఐదు శాతం, మహిళలకు 25 శాతం కేటాయించాలని నిర్ణయించారు. కాగా, అర్హుల తుది జాబితా ఖరారు చేసే బాధ్యత ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిపైన ప్రభుత్వం ఉంచింది.

### రూ.4 లక్షల యూనిట్లకే ఎక్కువ ప్రాధాన్యం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతోపాటు ఆర్థికంగా వెనుకబడిన తరగతుల నుంచి కూడా దరఖాస్తులు స్వీకరించారు. యువత సొంతంగా వ్యాపారం ప్రారంభించి ఆర్థికంగా నిలదొక్కుకోవడమే కాకుండా పలువురికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి దోహదపడే విధంగా రాజీవ్ యువ వికాసం పథకానికి రూపకల్పన చేశారు. జిల్లాకు మొత్తం 15,275 యూనిట్లు మంజూరు కాగా, 57,844 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో రూ.50 వేలకు సంబంధించి 4,704 యూనిట్లు కేటాయించగా వీటి కోసం కేవలం 790 దరఖాస్తులు వచ్చాయి. రూ.లక్ష కు సంబంధించి 3,719 యూనిట్లు మంజూరు కాగా, 2,485 దరఖాస్తులు వచ్చాయి. రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 3,116 యూనిట్లు కేటాయించగా 5,921 దరఖాస్తులు వచ్చాయి. రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు 655 యూనిట్లు మంజూరు కాగా 3,267 దరఖాస్తులు వచ్చాయి. రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు 1,062 యూనిట్లు కేటాయించగా 9,589 దరఖాస్తులు వచ్చాయి. రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు యూనిట్లు 2,019 మంజూరు కాగా, 35,792 దరఖాస్తులు వచ్చాయి. కాగా, ఈ దరఖాస్తుల్లో 35,792 మంది దరఖాస్తుదారులు రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల యూనిట్ల కోసమే దరఖాస్తు చేసుకోవడం విశేషం. రూ.4 లక్షల రుణం తీసుకుంటే అత్యధికంగా రూ.2.80 లక్షల రాయితీ వర్తించనుండడంతో ఎక్కువ మంది ఈ విలువ కలిగిన యూనిట్లను ఎంపిక చేసుకున్నారు.

### నిలిచిపోయిన అర్హుల ఎంపిక

జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు, 20 మండలాలు ఉన్నాయి. మున్సిపాలిటీలు, మండలాల వారీగా జాబితాను రూపొందించి పరిశీలన, అర్హుల ఎంపిక చేపట్టారు. మండల ప్రత్యేకాధికారి కన్వీనర్‌గా, ఎంపీడీవో, బ్యాంకు మేనేజర్, కార్పొరేషన్ అధికారులతో కమిటీలు ఏర్పాటు చేశారు. వచ్చిన దరఖాస్తులను మండల, పట్టణ స్థాయిల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సిబిల్ స్కోర్, రుణ బకాయిలను తనిఖీ చేసిన తర్వాత ప్రాథమికంగా అర్హులను ఎంపిక చేశారు.

## తాగునీరు కలుషితం



పైపులైన్ వద్ద కలుషితం అవుతున్న నీరు

మర్పల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తాగునీటి పైపులైన్ లీకేజీతో మురుగునీరు చేరి కలుషితమవుతోందని మండలంలోని మొగిలిగుండ్ల గ్రామస్థులు వాపోయారు. గ్రామంలో తాగునీటి సరఫరాచేసే వాల్వ్ చెడిపోవడంతో మురుగునీరు పైపులైన్‌లోకి చేరి కలుషితమవుతోందని పంచాయతీ కార్యదర్శికి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతుతో నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

కొడంగల్/కొడంగల్ రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల, పెన్షనర్ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. హైదరాబాద్‌లోని కాచిగూడలో ఆదివారం నిర్వహించిన స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ 79వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలల్లో జీహెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలన్నారు. అపరిమిత ప్రైమరీ స్కూల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూర్ చేయాలన్నారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు అనుగుణంగా నూతన డీఎస్సీని వెంటనే ప్రకటించి ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు బేసిక్ పే కల్పిస్తూ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శులు యం. పాండు, రాష్ట్ర కౌన్సిలర్లు పవన్‌కుమార్, ఎండి షఫీ తదితరులు పాల్గొన్నారు.

## దోబీ పోస్టులు భర్తీ చేయాలి

కొడంగల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 220 పడకల ఆస్పత్రితో పాటు మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడున్న దోబీలతో పాటు నూతన దోబీ పోస్టులు భర్తీ చేయాలని రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి అన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, మహిళా అధ్యక్షురాలు లక్ష్మి తదితరులతో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అదేవిధంగా ఆధునాతన దోబీ ఘాట్‌కు ఎకరా భూమిని కేటాయించి కాంట్రాక్టు రజకులకు కేటాయించాలన్నారు. త్వరలో దోబీ ఘాట్ కోసం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి సమగ్ర సమాచారాన్ని అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా, మండల నాయకులు వెంకటయ్య, బాలప్ప, నాయకులు సుందరప్ప, వెంకటేశ్, నాగేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఘనంగా హజ్రాత్ కోచక్‌షావలీ దర్గా ఉర్సు

ధారూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హజ్రాత్ కోచక్‌షావలీ దర్గా ఉర్సు ధారూరులో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు ధారూరు జామ మసీదు నుంచి గంధంతో దర్గా వరకు ఊరేగింపుగా వెళ్లారు. దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి గంధం, చద్దర్ సమర్పించారు. అనంతరం రాత్రి జాగరణలో కవాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం మండలాధ్యక్షుడు మోహిజ్ ఖురేషి, ముస్లిం మత పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన

తాండూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయసేవల దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం తాండూరు -హైదరాబాద్ రోడ్డు మార్గంలోని బీసీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తాండూరు ప్యానల్ న్యాయవాదులు చంద్రశేఖర్, జిలాని, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజలకు ఉచితంగా అందిస్తున్న న్యాయసేవలపై వివరించారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ కుమార్, అరుణ్ పాల్గొన్నారు.

## మద్యం ప్రియులకు అడ్డాగా పాఠశాల భవనం



కులకచర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల బాలుర ఉన్నత పాఠశాల పాత భవనం మద్యం ప్రియులకు అడ్డాగా మారింది. పాత భవనం శిథిలావస్థకు చేరడంతో వదిలేయగా కొత్త భవనంలో తరగతులు కొనసాగుతున్నాయి. రాత్రి వేళల్లో సమీపంలో ఉన్న బెల్టు షాపుల నుంచి మద్యం తెచ్చుకొని పాఠశాల పాత భవనంలో సేవించి వెళ్తున్నారు. ఉదయం చూస్తే ఖాళీ సీసాలు దర్శనమిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాతభవనాన్ని కూల్చి కొత్త భవనం నిర్మించి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# పిక్కలు పీకేస్తున్నాయ్..

(ఐదో పేజీ తరువాయి)

కుక్కల గుంపు మహిళపై దాడిచేయగా స్థానికులు స్పందించి ఆమెను రక్షించారు.

### నానాటికీ పెరుగుతున్న సంతతి

తాండూరు పట్టణంలో గతేడాది ఆగస్టు నుంచి సుమారు ఆరు నెలలపాటు తాండూరు పట్టణంలో మగ కుక్కలను పట్టుకొని వాటికి తాండూరు చెత్త డంపింగ్ యార్డు వద్ద కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. ఒక్కో కుక్కను పట్టుకోవడానికి రూ.350 చొప్పున ఖర్చు చేశారు. తాండూరు మున్సిపాలిటీలో సుమారు 500 కుక్కలను 15 మంది సభ్యుల బృందం వల వేసి పట్టుకొని పశు వైద్యుని చేత శస్త్ర చికిత్సలు చేశారు. నాలుగు రోజుల తర్వాత వాటిని పట్టుకున్న చోటే వదిలేశారు.

### బడులు, బస్టాండ్ల వద్ద కనిపించరాదని కోర్టు ఆదేశాలు...

పాఠశాలలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలు కనిపించవద్దని ఇటీవల సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఆయా ప్రాంతాల్లో వీధి కుక్కలను పట్టుకొని షెల్టర్ హోంకు తరలించాలని, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత కూడా వాటిని అక్కడ వదలొద్దని ఆదేశించింది. కుక్క కాటు ఘటనలు పెరిగిపోతున్నందున ధర్మాసనం సీరియస్‌గా తీసుకుంది. యానిమల్ బర్త్ కంట్రోల్ నిబంధనల ప్రకారం వాటికి వ్యాక్సిన్, స్టెరిలైజేషన్ చేయించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. కుక్క కాటు బాధితుల్లో ఎక్కువగా చిన్నారులు, వృద్ధులు ఉంటున్నారు. బల్దియాల్లో అధికారులు తరుచూ తనిఖీలు నిర్వహించి కుక్కలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించిన విషయం తెలిసిందే..



తాండూరులో ఇటీవల మహిళను వెంబడిస్తున్న కుక్కలు(సీసీ ఫుటేజీ)


# ఆ 'పూర్వ' సమ్మేళనం



మర్పల్లి: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మర్పల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై కలిశారు. విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవూఫ్, ఉపాధ్యాయులు సర్దార్ మియా, పూర్వ విద్యార్థులు సిద్దేశ్వర, జనార్దన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, నర్సిములు, తిరుపతి, అర్జున్, శివ స్వామి, సుబ్బారావు పాల్గొన్నారు.

**ధారూరు:** మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ 1980-81 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండలంలోని ఓ రిసార్టులో జరిగింది. వీరిలో ప్రభుత్వ ఉద్యోగాలు చేసి పదవీ విరమణ పొందిన వారిని పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు. పేద విద్యార్థులకు సాయం చేయాలని నిర్ణయించారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా కలిసి భోజనాలు చేశారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు రామ్‌రెడ్డి, తాజోద్దీన్, వెంకట్రామిరెడ్డి, సురేఖ, దామోదర్, వెంకట్‌లక్ష్మి, ప్రతాప్‌రెడ్డి, సైమాన్, సురేందర్‌రెడ్డి, మిత్ర బృందం పాల్గొన్నారు.



ధారూరు: ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

## అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఘట్‌కేసర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు సంజీవ్ చౌహాన్ అన్నారు. అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మీసాల అరుణ్ కుమార్, సాయికృష్ణ, దాను, నగేష్, నర్సింగరావు, సత్యం పాల్గొన్నారు.

## సంస్కృతీసంప్రదాయానికి ప్రతీక సదర్



ఉత్సవాల్లో మాట్లాడుతున్న సంఘం నాయకులు

దుద్యాల: సంస్కృతీ సంప్రదాయానికి ప్రతీక సదర్ అని అఖిల భారత యాదవ సభ జిల్లా అధ్యక్షుడు జింకల యాదయ్య, ఉపాధ్యక్షుడు పుర్ర రాఘవేందర్ యాదవ్ అన్నారు. పోలెపల్లి గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సదర్ వేడుకలు నిర్వహించారు. దున్నపోతుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు పెంటయ్య యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

## 4కే రన్‌తో కేన్సర్‌పై అవగాహన



4కే రన్‌లో యువతీ యువకులు

ఘట్‌కేసర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో ఆదివారం మెల్విన్ ఫిట్‌నెస్ స్టూడియో, సెయింట్ అంతోపీస్ పాఠశాల షేరింగ్ కేర్ ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన కల్పిస్తూ 4కే రన్ నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు కేన్సర్ రోగులు పెరిగిపోతున్నారన్నారు. ప్రధానంగా చదువుకునే చిన్నారులు సైతం కేన్సర్ బారిన పడటం బాధాకరమన్నారు. వ్యాధిబారిన పడిన వారు చదువుకు దూరం అవుతున్నారని తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో నిధులు సమీకరించి ఈనెల 14 చిల్డ్రన్స్ డే సందర్భంగా అందజేస్తామని తెలిపారు.

## సంక్షిప్తంగా..

### ఆలయంలో చతుర్మాస పూజలు

కొడంగల్: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక ధార్మిక సేవాసమితి ఆధ్వర్యంలో చతుర్మాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాలుగు నెలల పాటు ప్రతీ శనివారం సేవాసమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. హనుమాన్ చాలీసా పారాయణం, లింగాష్టక పారాయణం నిర్వహిస్తూ స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ హీరాలాల్ అన్నారు.

### కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో నూతనంగా నిర్మించిన బంజారాల దైవం జగదాంబ మాత, గురువు సంత్ సేలాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు 2వ రోజు ఆదివారం కొనసాగాయి. ప్రతిష్ఠమండప దేవతాపూజ, చండీహవనం, మహాస్నపనం తదితర పూజలను ఘనంగా నిర్వహించారు.

### అయ్యప్ప మాలధారణ

కులకచర్ల:బండవెల్కిచర్ల పాంబండ ఆలయంలో ఆదివారం భక్తులు అయ్యప్పమాల ధరించారు. పాలమూర్ ఈశ్వర్ గురుస్వామి ఆధ్వర్యంలో 30మంది స్వాములు మాలధారణ చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు ఈశ్వరయ్య, రాములుగౌడ్, ఆంజనేయులుగౌడ్, చంద్రశేఖర్, శివకుమార్‌గౌడ్, శ్రీశైలం పాల్గొన్నారు.

### కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరు

కులకచర్ల: జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీచైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో చివరిరోజు ఆదివారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని కోరుతూ మంత్రి వివేక్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఆంజనేయులు ప్రచారంలో పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### లారీ ఢీకొని వ్యక్తి మృతి



మహేశ్(ఫైల్)

బంట్వారం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కర్ణాటక రాష్ట్రం సేడెమ్ తాలుకా మాల్కేక్ మండల పరిధిలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో ఆదివారం జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. బంట్వారం మండల కేంద్రానికి చెందిన కొండిగారి మహేశ్(33) వారం రోజుల కిందట కార్తికేయ ట్రాన్స్‌పోర్ట్‌లో డ్రైవింగ్ చేస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఆదివారం ఉదయం వాహనం కర్ణాటక రాష్ట్రం సేడెమ్ తాలుకా మాల్కేక్ మండలంలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో రోడ్డుపై నిలబడి ఉన్న సమయంలో ఒక్కసారిగా ప్రమాదవశాత్తు లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మహేశ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. దీంతో కర్ణాటక పోలీసులు మహేశ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి..

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రోడ్డుదాటుతుండగా కారు ఢీకొని ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ ఎం.బాలస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి-భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామానికి చెందిన కుదాడి ప్రసాద్(40) ఈనెల 2వ తేదీన ఘట్‌కేసర్ మైసమ్మగుట్ట వందన హోటల్ సమీపంలో రోడ్డు దాటుతుండగా కారు ఢీకొంది. దీంతో అతడు అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రసాద్ గాంధీ ఆస్పత్రిలో మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### అనుమానాస్పద స్థితిలో మరొకరు..



కృష్ణ మృతదేహం

పూడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన పూడూరు మండల పరిధిలోని మన్నెగూడ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కంకల్ గ్రామానికి చెందిన ఉవ్వగుంట కృష్ణ(36) పరిగి పట్టణంలో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. రోజువారీగా శనివారం కూడా ఫుడ్ డెలివరీ కోసం ఇంటి నుంచి బయల్దేరిన కృష్ణ ఆదివారం మన్నెగూడ సమీపంలో శవమై కనిపించాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఒంటిపై, చేయి, ఛాతిపై గాయాలు కనిపిస్తున్నాయని కుటుంబసభ్యులు ఆరోపించారు. ఎవరో హత్య చేసినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

### గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం




పట్టాల పక్కన యువకుడి మృతదేహం

బషీరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని ఓ యువకుడి మృతదేహం రైలుపట్టాల పక్కన లభ్యమైంది. ఈ ఘటన బషీరాబాద్ మండలం మంతట్టి రైల్వేస్టేషన్ సమీపంలో యార్డు వద్ద ఆదివారం వెలుగు చూసింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంతట్టి రైల్వేస్టేషన్ దగ్గరలో ఓ గుర్తుతెలియని యువకుడు(25) మృతిచెంది ఉండటంతో స్థానిక రైల్వే సిబ్బంది స్టేషన్‌మాస్టర్‌కు సమాచారం ఇచ్చారు. ఈ విషయమై రైల్వే పోలీసులకు తెలపగా ఘటనాస్థలానికి చేరుకుని విచారణ జరిపారు. మృతుడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. అతడి ఒంటిపై బ్లూ కలర్ జర్కిన్, ఆరెంజ్ కలర్ షర్టులో ఉన్నాడని రైల్వేపోలీసులు తెలిపారు. మృతదేహాన్ని తాండూరు జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని తెలిపారు. రైలులో నుంచి పడ్డాడా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉండొచ్చనే కోణంలో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు వెల్లడించారు.

### గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ బోల్తా

- గుంతను తప్పించబోయి ప్రమాదం
- తప్పిన ముప్పు



రాకంచర్ల-పెద్దఉమ్మెంతల్ రోడ్డు మార్గంలో బోల్తా కొట్టిన గ్రానైట్ లోడ్

పూడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుంతను తప్పించబోయి గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ బోల్తాపడింది. ఈ ఘటన పూడూరు మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని రాకంచర్ల-పెద్దఉమ్మెంతల్ రోడ్డు మార్గంలో ఆదివారం ఓ టిప్పర్ గ్రానైట్ రాళ్ల లోడ్‌తో వెళ్తోంది. ఈ క్రమంలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయం సమీపంలోకి రాగానే టిప్పర్ రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ ప్రాణాలతో బయటపడగా ఆ సమయంలో ఎలాంటి వాహనాలు, ప్రయాణికులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రోడ్డుపై బోల్తా కొట్టిన టిప్పర్‌ను స్థానికులు జేసీబీ సాయంతో తొలగించారు. వారం రోజుల క్రితమే కంకర టిప్పర్ ఆర్టీసీ బస్సును ఢీకొని 19మంది మృతి చెందిన ఘటన మరువకముందే మరో టిప్పర్ బోల్తాకొట్టడంతో ప్రయాణికులకు భయాందోళనకు గురవుతున్నారు. హెవీలోడ్ వాహనాలను అధికారులు నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### చికిత్స పొందుతూ ఉద్యోగి మృతి



విజయ్‌కుమార్ రెడ్డి (ఫైల్)

దోమ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిన్నతనంలో ఉద్యోగం సాధించి ఉన్నతాధికారుల వద్ద పేరు ప్రఖ్యాతలు పొందిన ఓ ఉద్యోగిని మృత్యువు వెంటాడింది. మండలంలోని బొంపల్లి గ్రామానికి చెందిన ఆర్.కృష్ణారెడ్డి, పద్మమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. అందులో పెద్ద కుమారుడు అజయ్‌కుమార్‌రెడ్డి ఏఆర్ కానిస్టేబుల్‌గా వికారాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు విజయ్‌కుమార్(30) వీఆర్‌వోగా విధులు నిర్వహించి అడిషనల్ కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ వద్ద సీసీగా విధులు నిర్వహించాడు. ఇటీవలే అంగరంగ వైభవంగా వివాహం జరగగా సివిల్స్ కోసం ప్రిపేర్ అయ్యేందుకు సెలవుపై వెళ్లాడు. రెండు నెలల నుంచి ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతుండగా కుటుంబసభ్యులు ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు చేయించినా ఆరోగ్యం కుదుటపడలేదు. ఈ క్రమంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విజయ్‌కుమార్‌రెడ్డి మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.